# గలతీయులకు వ్రాసిన పత్రిక 6వ అధ్యాయము

### అభ్యాస సిద్ధమైన హెచ్చరికలు

సహోదరులారా, ఒకడు ఏ తప్పిదములోనైనను చిక్కుకొనినయెడల ఆత్మసంబంధులైన మీలో ప్రతివాడు తానును శోధింపబడుదునేమో అని తన విషయమై చూచుకొనుచు, సాత్వికమైన మనస్సుతో అట్టివానిని మంచి దారికి తీసికొని రావలెను. 2 ఒకని భారము ఒకడు భరించి, ఈలాగు క్రీస్తు నియమమును పూర్తిగా నెరవేర్చుడి 3 ఎవడైనను వట్టివాడైయుండి తాను ఎన్నికైనవాడనని ఎంచుకొనినయెడల తన్నుతానే మోసపరచు కొనును. 4 ప్రతివాడును తాను చేయుపనిని పరీక్షించి చూచుకొనవలెను అప్పుడు ఇతరునిబట్టి కాక తననుబట్టియే అతనికి అతిశయము కలుగును. 5 ప్రతివాడును తన బరువు తానే భరించు కొనవలెను గదా ?

6 వాక్యోపదేశము పొందువాడు ఉపదేశించువానికి మంచి పదార్థములన్నిటిలో భాగమియ్యవలెను. 7 మోసపోకుడి దేవుడు వెక్కిరింపబడడు మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును. 8 ఏలాగనగా, తన శరీరేచ్ఛలనుబట్టి విత్తువాడు తన శరీరమునుండి క్షయమను పంట కోయును. ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మ నుండి నిత్యజీవమను పంట కోయును. 9 మనము మేలుచేయుట యందు విసుకక యుందము. మనము అలయక మేలు చేసితిమేని తగినకాలమందు పంటకోతుము. 10 కాబట్టి మనకు సమయము దొరకినకొలది అందరియెడలను, విశేషముగా విశ్వాసగృహమునకు చేరినవారియెడలను మేలు చేయుదుము. 11 నా స్వహస్తముతో మీకెంత పెద్ద అక్షరములతో వ్రాయుచున్నానో చూడుడి

### ముగింపు మాటలు

12 శరీర విషయమందు చక్కగా అగపడ గోరువారెవరో వారు తాము క్రీస్తు యొక్క సిలువ విషయమై హింస పొందకుండుటకు మాత్రమే సున్నతి పొందవలెనని మిమ్మును బలవంతము చేయుచున్నారు. 13 అయితే వారు సున్నతిపొందిన వారైనను ధర్మశాస్త్రము ఆచరింపరు తాము మీ శరీరవిషయమందు అతిశయించు నిమిత్తము మీరు సున్నతి పొందవలెనని కోరుచున్నారు. 14 అయితే మన ప్రభువైన యేసుక్రీస్తు సిలువయందు తప్ప మరి దేనియందును అతిశయించుట నాకు దూరమవును గాక దానివలన నాకు లోకమును, లోకమునకు నేనును సిలువవేయబడియున్నాము. 15 క్రొత్తసృష్టి పొందుటయే గాని సున్నతి పొందుటయందేమియు లేదు, పొందకపోవుట యందేమియు లేదు.

16 ఈ పద్ధతి చొప్పున నడుచుకొను వారికందరికి, అనగా దేవుని ఇశ్రాయేలునకు సమాధానమును కృపయు కలుగును గాక. 17 నేను యేసుయొక్క ముద్రలు నా శరీరమందు ధరించి యున్నాను, ఇక మీదట ఎవడును నన్ను శ్రమపెట్టవద్దు. 18 సహోదరులారా, మన ప్రభువైన యేసుక్రీస్తు కృప మీ ఆత్మతో ఉండును గాక. ఆమేన్.